స్వాతి వీక్లీ రొమాంటిక్ సీరియల్

# ఖజూరవాటిక



బి.గీతిక

# ఖర్జూర వాటిక

ఎప్పటికంటే ముందుగా చలిగాలుల్ని తెస్తోంది హేమంత ఋతువు.

సూర్యుడు వెళ్ళీవెళ్ళగానే.. చీకటి తెరల్ని ఒక్కొక్కటిగా దించుతోంది కృష్ణ పక్షపు సాయంత్రం.

ఖాళీ మట్టికుండని నడుమ్మీద పెట్టుకుని, ఇంకో చేత్తో పాడిబట్టల్ని పట్టుకుని, ఊరి చివరనున్న మంచినీళ్ళ బావి దగ్గరకు వచ్చింది పద్దెనిమిదేళ్ళ నవయవ్వన యువతి బదనిక. చేతిలో ఉన్న బట్టల్ని బావిమీద పెట్టి, అక్కడే ఉన్న చేదతో నీళ్ళు తోడి సంశయంగా చుట్టూ చూసిందామె.

నిర్మానుష్యం నిండిన ఆ వాతావరణంలో ఎవరూ లేరని నిర్ధారించుకున్న తరువాత.. నిస్సంకోచంగా ఓణీని తీసి పక్కన పెట్టింది బదనిక. నీళ్ళు తోడిన చేదను మెల్లగా రెండు చేతులతో పైకి లేపి, తలమీద సన్నని ధార పడేలా పట్టుకుంది.

చల్లని వాతావరణంలో– తలమీద పడుతున్న వెచ్చటి ఊటబావి నీళ్ళు.. హాయిగొలుపుతూ ఆమె నల్లని కురుల ముడిలో చిక్కుకుని ఒక్క క్షణం ఆగాయి. వెంటనే ఆ నీళ్ళు దారులు అన్వేషించే భిన్న మార్గాలుగా చీలుతూ.. బదనిక కనుబొమ్మల మీదనుంచి, కోటేరు నాసిక మీదకి జారి, ఆమె నునుపైన బుగ్గలని పరవశంగా తాకుతూ, పలుచని చెవి తమ్మెలని సుతారంగా మీటుతూ, వంపు తిరిగిన మెడమడతల మీదుగా,.. ఎత్తైన ఎదశిఖరాలమీద పడి జలపాత ధారలై కిందికి దూకుతున్నాయి.

కొన్ని నీటిచుక్కలు మాత్రం– తమకి అక్కడే బాగున్నట్టుగా ఆమె వెచ్చని అధరాల మధ్యనే నిల్చిపోతున్నాయి. ఆమె మెడనుంచి కిందకి జారుతున్న సన్నని నీటిపాయలు కొన్ని– కాంతి కూడా చొరబడలేని ఇరుకు సందుల్లోకి చొచ్చుకుపోతూంటే, మాటల్లో చెప్పలేని అనుభూతి బదనిక మనసుని గిలిగింతలు పెడుతోంది. ఆ గిలిగింతలకి తోడు... ముద్దగా చుట్టుకుపోతున్న తడిబట్టల బిగి.. ఓ హాయైన పరవశాన్ని రేపుతోంది బదనికలో.

అప్పటివరకూ రానా వద్దా అని తచ్చట్లాడిన చంద్రుడు– ఆమెని చూసీ చూడడంతోనే హడావుడిగా పైకొచ్చి, తనవద్ద ఉన్న ఒక్కో వెన్నెలబాణాన్నీ తీసి, గురిచూసి వదులుతున్నాడు. పంచమి కూడా పూర్తి చేసుకోని పల్చని వెన్నెల– చీకట్లని తరమడానికి మెల్లగా ప్రయత్నిస్తోంది.

నిదానంగా పెరుగుతున్న వెలుగుకి తాను ఎవరి కంట్లోనన్నా పడుతున్నానా అని అనుమానంగా, చుట్టూ పరిశీలనగా చూసింది బదనిక. ఎవరూ కనిపించలేదు ఆమెకి. గుండెల నిండుగా ఊపిరి పీల్చుకుంటూ, తాడు చేతిలోకి తీసుకుని ఖాళీ అయిన చేదని మళ్ళీ బావిలోకి వదిలిందామె.

ఒకటి..

రెండు...

మూడు.... చేదల నీళ్ళు బదనిక సుతారమైన మేనిని తడుపుతూనే ఉన్నాయి. అణువణువూ తడిచి, మెత్తబడిన మేనుని చేతులతో సుతిమెత్తగా రుద్దుకుంటూ, తనవంక చూసుకుంది బదనిక.

తడిచిన రవిక– ఒంటిని నొక్కిపట్టుకుని, ఆమె వంపుసొంపుల్నీ శరీరాకృతినీ బహిర్గతం చేసేస్తోంది. ఆమె ఎటు కదిలినా, ఎప్పుడూ.. ఆమె చుట్టూ నేలమీదనుంచి మొలిచిన కోటప్రహరీగోడలా నిలబడుండే పరికిణీ– ఇప్పుడు ఆమె కాలివేళ్ళ నుంచీ కప్పించే నాభివరకూ, భీతిచెందిన బాలుడిలా ఆమె రెండుకాళ్ళనీ చుట్టుకుపోయుంది.

మనసంతా నిండిన హాయితో సన్నగా గొంతు విప్పి పాడుకుంటూ, అరచేతులతోనే ఒళ్ళు రుద్దుకుని స్నానం చేస్తూ, మధ్య మధ్య ముసిముసిగా నవ్వుకుంటూ, స్నానం పూర్తి చేసింది బదనిక.

స్నానం అవడంతోనే బావిపై పెట్టిన పొడిబట్టల్లోంచి పరికిణీని తీసి తలపైనుంచి కిందకు వేసుకుంది. దానిని కిందకు లాక్కుంటూనే.. ఒంటిని చుట్టుకుపోయున్న తడిచిన పరికిణీని నేలమీదకు జారవిడుస్తూ... ఒడుపుగా బట్టలు మార్చుకుంది బదనిక. తడిజుట్టులో నుంచి జారుతున్న ఆఖరి నీటిచుక్కలు ఆమె వెనకవైపు పరికిణీకి చల్లని చెమ్మని అంటిస్తున్నాయి.

విడిచిన బట్టల్ని చకచకా ఉతికి, మరోమారు నీళ్ళుతోడి.. తనతో తెచ్చిన మట్టికుండని నీళ్ళతో నింపి నడుముమీదకి ఎత్తుకుందామె. బదనిక ఎడమచేయి– వాటంగా మట్టికుండని చుట్టి పట్టుకుంటే, కుడిచేయి ఉతికిన బట్టల్ని అందుకుంది.

కుండలోని నీళ్ళు తొణకకుండా మెల్లగా అడుగులో అడుగు వేసుకుంటూ, ముందుకు కదిలింది బదనిక. అలా కొంచెం దూరం వెళ్ళిందో లేదో.. వెనకనుంచి, “బ...ద..నికా...” అని సంశయంగా పిలుస్తూ, ఒక మగగొంతు వినిపించింది ఆమెకి.

ముందుకు పడుతున్న బదనిక పాదాలు చటుక్కున ఆగాయి. ఎవరా అని వెనక్కి తిరిగి చూసిందామె. ఆమె వెనక ఉన్నది.. సోమనాథుడు. అతన్ని చూడగానే, విసురుగా మొహం తిప్పుకుని వడివడిగా ముందుకు అడుగులేసింది బదనిక.

“బదనికా.. ఒక్క క్షణమాగు. నిన్నే..” అని పిలుస్తూ, పరుగున ఆమెదగ్గరకు వచ్చాడు సోమనాథుడు.

తనకేం వినబడనట్టుగా, అతనివంక చూడకుండా, ముందుకు నడుస్తూనే ఉంది బదనిక.

సోమనాథుడు కూడా ఆమె నడకలో నడక కలుపుతూ, “బదనికా.. నాతో మాట్లాడవా. నేనేం

అపరాధం చేశాను. కనీసం అదయినా చెప్పు.” అని బతిమాలే స్వరంతో అడిగాడు సోమనాధుడు.

ఆ మాట వినగానే ఆగి, అతనివంక తీక్షణంగా చూసింది బదనిక. మసకమసకగా కనబడుతున్న అతని కళ్ళలోకి స్థిరంగా చూస్తూ, “ఒక ఆడపిల్ల స్నానం చేసి బట్టలు మార్చుకుంటున్నప్పుడు చూడడం అపరాధం కాదా..? నాకు ఇష్టం లేకపోయినా, మాట్లాడమంటూ పదేపదే ఇలా నా వెంట పడడం అపరాధం కాదా..? ఒంటరిగా ఉన్న ఆడపిల్లను ఇలా వేధించడం నీ మనసుకి తప్పు కాదనిపిస్తోందా..?” అని కోపంగా అడిగింది బదనిక.

ఆమె మాటలకి ఖిన్నుడై, “బదనికా.. నేను ఇప్పుడే వచ్చాను. నువ్వు బావి దగ్గరనుంచి వస్తుంటే అంతదూరం నుంచి నిన్ను చూసి, నీ ఎదుటపడలేక ఆ చెట్టుచాటున ఉన్నాను. అంతేగానీ నేను బావి దగ్గరకు రాలేదు, నిన్ను చూడలేదు. ఇప్పుడుకూడా నీతో మాట్లాడాలా వద్దా అని సందేహ పడుతూనే, నీ వద్దకు వచ్చాను. కానీ.. నీకు నేనంటే ఇంత అయిష్టమని ఊహించలేదు..” అని ఆమెవంక చూస్తూ సంజాయిషీ ఇస్తున్నట్టుగా చెప్పాడు సోమనాధుడు.

“అయిష్టమంటే అయిష్టమే. దానిలో అంతా ఇంతా అని లేదు. ఇకపై ఎప్పుడూ ఇలా నన్ను వెంటాడకు..” అని ఖచ్చితంగా చెప్పి ముందుకు కదిలింది బదనిక.

వెళ్ళిపోతున్న ఆమెనే దీనంగా చూస్తూ, కాలు కదపలేని శిలలా అక్కడే నిలబడిపోయాడు సోమనాధుడు. నడుస్తున్న బదనిక కాలి అందెల శబ్దం అతని చెవులకి లీలగా తగ్గుతూ వినిపిస్తోంది.

‘బదనిక వెళ్ళిపోతోంది. నన్నూ, నా మనసులోని ఇష్టాన్నీ.. అయిష్టమంటూ వెళ్ళిపోతోంది.. నేనేం చెయ్యాలి..’ అనే సంఘర్షణ సోమనాధుని మనసునిండా నిండిపోయింది.

“బదనీ.. ఓయ్ బదనీ.. ఏమిటమ్మోయ్ ఆ పరధ్యానం..?” అని మాటల్ని మెలితిప్పుతూ దూరంనుంచే పిలిచింది బదనిక స్నేహితురాలు సూర్యవతి.

ఆ మాటలకి ఉలికిపాటుగా ఆగి అటూఇటూ చూసింది బదనిక.

పక్కనున్న వీధి మలుపులోంచి ఛెంగున వచ్చి బదనిక భుజంపై చేయి వేస్తూ, “ఏమిటే బాలా ఈ పరధ్యానం..? చూపులు ఆకాశంలో నిలిపి వెళ్తున్నావు..! ఆ శిలల సోమనాధుడుగానీ నీ మనసుని కవ్విస్తున్నాడా ఏమి..?” అనడిగింది సూర్యవతి.

“ఛీ..! సూర్యా.. ఏమిటే ఆ మాటలూ..? సిగ్గుండొద్దూ..! నా దృష్టిలో ఆ శిలలు చెక్కే సోమనాధుడు నిజంగా శిలవంటి వాడే. నీ చెణుకులిక కట్టిపెట్టు..” అని స్నేహితురాలిని మందలిస్తున్నట్టుగా చెప్పింది బదనిక.

“అబ్బొబ్బో.. చూశాలే. సోమనాధుడు వచ్చిన నాటినుంచీ నీ అడుగుల వెంటే ఏడడుగులూ వేస్తున్నాడు. అతన్ని శిలతో పోలుస్తావేం..?” అంటూ మరింత కవ్వించింది సూర్యవతి.

“స్సోమనాధుడు..! నా వెంట ఏడడుగులు..! హు.. ఇక అయినట్టేలే. ఆ ఏడడుగులు మాత్రమే నాతో ఉంటాయి. తరువాత వాడు ఎక్కడో శిల్పాలు చెక్కుతూ కూర్చుంటాడు. నేను ఇక్కడ చన్నీళ్ళ

స్నానం చేసి పడుకుంటాను..! అయినా కనీసం గుఱ్ఱపుస్వారీ కూడా రానివాడు, నేను కోరుకునే ధీరత్వం లేనివాడు, నాకు జతగాడెలా అవుతాడే..?” అని ప్రశ్నిస్తున్నట్టుగా తల ఎగరేసింది బదనిక.

“మరీ.. క్షణం క్రిందట సోమనాధుడు.. నీ కోసం అన్వేషిస్తూ బావి దగ్గరకు వచ్చినట్టున్నాడు..” అంటూ ఇంకా ఏదో చెప్పబోయింది సూర్యవతి.

“ఆ.. వచ్చాడు. నేనంటే ఇష్టమని చెప్పాడు. నేనూ చెప్పాను... నువ్వంటే నాకు అయిష్టమని..” అంటూ మెల్లగా నడుస్తూ చెప్పింది బదనిక. అంతే.. ఆమె మాటలు వింటూనే, “హమ్మో..!” అంటూ గుండెల మీద చెయ్యి వేసుకుని, “ఒక ఆజానుబాహుడైన మగవాడు మనసుపడి మాట్లాడబోతే.. కొట్టినట్టు బదులిచ్చావా..” అని విస్మయంగా అంది సూర్యవతి.

“అవును ఇచ్చాను. చాలా.. ఇంకా ఏవైనా వివరాలు కావాలా..?” అంటూ పొంగుతున్న గర్వాతిశయాన్ని లోపలకి అణుచుకుంటూ అంది బదనిక.

“ఇంకే వివరాలూ వద్దులేగానీ, మరి సోమనాధుడెక్కడే...?” అని నడుస్తున్నదల్లా ఆగి, కుతూహలంగా వెనక్కి తిరిగి చూస్తూ అడిగింది సూర్యవతి.

“అక్కడే శిలలా ఉండిపోయినట్టున్నాడు. పోయి చూడు..” అని లోలోపలే నవ్వుకుంటూ, “నాతో మాటల్లో పడి మీ ఇంటిని మరిచినట్టున్నావ్. మీ ఇల్లు వచ్చింది వెళ్ళు. నేను కూడా నీటి కుండని మోసిమోసీ నీరుగారుతున్నాను..! ఇక ఇంటికి వెళతాను...” అని నీరసంగా అంది బదనిక.

“సరేలే.. వెళ్ళిరా. మా ఆయన కూడా నాకోసం చూస్తూ ఉంటాడు..” అని వాళ్ళ ఇంటివైపు అడుగులేసింది సూర్యవతి.

నడుమ్మీద నుంచి జారుతున్న నీటికుండని అలవోకగా పైకి జరుపుకుని, ముందుకు అడుగేయబోయింది బదనిక. ఏదో గుర్తొచ్చినదానిలా, “ఏయ్ బదనీ.. ఒక్కక్షణం ఆగు..” అంటూ పరుగున వెళ్ళి, వాళ్ళ ఇంటి అరుగుమీద ఉన్న సన్నజాజి పూలమాలని తెచ్చి బదనికకి ఇచ్చింది సూర్యవతి.

తడి ఆరుతున్న బట్టల్ని భుజంపై వేసుకుని, సూర్యవతి ఇచ్చిన పూమాలని అందుకుని, వాటి సువాసనని గుండెల నిండా పీలుస్తూ, “ఆహా.. ఏం మత్తుగా ఉన్నాయో సూర్యా..” అని అరమోడ్పు కన్నులతో తన్మయత్వంగా అంది బదనిక.

“ఆ.. ఉంటాయుంటాయ్.. ఆ మత్తులో పడే ఇహ ప్రపంచాన్ని మరుస్తున్నావ్..” అని కొంచెం కోపంగా అంది సూర్యవతి.

“నేనేం మరిచానే..?” అని విస్తుపోతూ వెంటనే అడిగింది బదనిక.

“లేకపోతే సున్నిత మనస్కుడు కావాలంటావ్. అంతలోనే వీరత్వం ఉండాలంటావ్. గుఱ్ఱపుస్వారీ రావాలంటావ్. నీకు దూరంగా ఉండకూడదంటావ్. ఇన్ని సుగుణాలున్నవాడు ఎలా దొరుకుతాడే..? అయినా.. మగవారంటే శిలలవంటి వారేనే బదనీ. ఈ ప్రపంచంలో నువ్వు అనుకుంటున్నట్టుగా

పువ్వంటి మగవారు ఉండరే..” అంటూ పెద్ద అనుభవజ్ఞురాలిలా హితబోధ చేసింది సూర్యవతి.

“ఈ ప్రపంచంలో శిలవంటి ఆడవారు ఉన్నట్లే, పూవంటి మగవారూ ఉంటారే..” అని నమ్మకంగా అంటూ ముందుకు కదిలింది బదనిక.

వింత విషయం వింటున్నట్టుగా చెంపకు చేయి ఆన్చుకుని, “పూవంటి మగవారు ఉంటారే బదనీ. కానీ వాళ్ళు పువ్వుల్లాగే ఉంటారు. నువ్వు కోరుకున్నట్టుగా గుర్రపుస్వారీ చేస్తూ, వీరుడిలా మాత్రం ఉండరు. ఒకవేళ నువ్వు కోరుకునే పువ్వుల్లాంటి మగవారు ఉన్నా.. వాసన చూడడానికి మాత్రమే పనికొస్తారేమో..” అని ముందుకు వెళ్ళిపోతున్న బదనికకి వినబడేలా గట్టిగా అరుస్తూ చెప్పింది సూర్యవతి. కానీ అప్పటికే ఊహాలోకంలోకి జారిపోయి, సూర్యవతి మాటల్ని పట్టించుకోకుండా పదడుగులు ముందుకెళ్ళిపోయింది బదనిక.

‘కలల చెలికాడు.. కలల్లోనే ఉంటాడుగానీ, ఇలకు వస్తాడా.. దీని పిచ్చిగానీ..’ అని నిట్టూర్చి, తనలో తనే అనుకుంటూ, వయ్యారంగా నడుస్తూ వెళ్ళిపోతున్న బదనికని చూస్తూ నిలబడిపోయింది సూర్యవతి.

× × ×

సరిగ్గా అదే సమయంలో...

కలింజర్ రాజ్యానికి మహామంత్రైన చంద్రకేతు ఇంటికి చేరుకున్నాడు కలింజర్ సర్వసైన్యాధ్యక్షుడు బ్రహ్మతీర్థ. ఒక పక్కన.. మరో రెండు రోజుల్లో జరగబోతున్న ఆలయ శంకుస్థాపనకోసం ఖజూరవాటిక గ్రామానికి వెళ్ళే పనుల్లో తలమునకలై ఉండగా; ఇంత హఠాత్తుగా రహస్య సమావేశమంటూ మహామంత్రిగారు కబురు చేయడానికి కారణం ఏమిటో ఎంతకీ అర్థంకాలేదు బ్రహ్మతీర్థకి. ఏం వార్త వినాల్సి వస్తుందోనని కాస్తంత ఆదుర్దాగానూ ఉంది.

బ్రహ్మతీర్థని చూడడంతోనే ఆత్రంగా లోపలి గదిలోకి తీసుకు వెళ్ళి, “బ్రహ్మతీర్థగారూ..! ఇప్పుడు మనకొక పెద్ద చిక్కు వచ్చిపడింది. మనం త్వరగా చేయవలసిన పని ఇది. కానీ, ఎలా చెయ్యాలన్నదే నాకు అయోమయంగా ఉంది..” అని కంగారుపడుతూ అన్నాడు మహామంత్రి చంద్రకేతు.

“అసలు ముందు మనకొచ్చిన చిక్కేమిటో చెప్పండి మహామంత్రీ..” అని నిదానంగా అడిగాడు బ్రహ్మతీర్థ.

“చెబుతాను సేనానిగారూ. మన మిత్రరాజ్యమైన కన్నౌజు రాజ్యాధిపతి మన మహారాజుగారికి ఒక లేఖ పంపారు. దానిలో ఒక రహస్య సమాచారం వ్రాయబడి ఉంది..” అని ఆపాడు చంద్రకేతు.

“ఏమిటా సమాచారం..?” అని నొసలు ముడిచి కుతూహలంగా అడిగాడు బ్రహ్మతీర్థ.

“ఇది మామూలు విషయం కాదు బ్రహ్మతీర్థ గారూ. ముందు ఇలా కూర్చోండి. మాట్లాడదాం..” అని ఆయన వంక చూస్తూ అన్నాడు చంద్రకేతు.

బ్రహ్మతీర్థ కూర్చుంటూనే, “చెప్పండి మహామంత్రీ. ఆ లేఖలో ఏం ఉంది..? అది.. అంత

రహస్యమైన సమాచారమా..!" అని ఆసక్తిని ఆపుకోలేక అడిగాడు.

"అవును బ్రహ్మతీర్థగారూ. రహస్య సమాచారమే. కన్నౌజు రాజు పుత్రికని అంటే రాకుమారిని.. వారికి శత్రు రాజ్యమైన మధురానగరరాజు ఇంద్రరాజు అపహరించుకుపోయాడట. ఆ ఇంద్రరాజుని వెంబడించిన కన్నౌజు రాజ్యసేనలు.. ఇంద్రరాజు ఆమెతో సహా మన రాజ్యంలోకి ప్రవేశించి ఖజూరవాటికవైపుగా సాగాడని తెలిపారట..." అంటూ చెబుతున్న చంద్రకేతు మాటలు ఇంకా పూర్తికాకముందే, "ఖజూరవాటిక వైపుగానా...!!" అని విస్మయంగా అడిగాడు బ్రహ్మతీర్థ.

"అవును సేనాధ్యక్షా. ఆ ఇంద్రరాజు రాకుమారిని తీసుకుని ఖజూరవాటిక వైపు సాగుతూ కన్నౌజు సేనల దృష్టిలో నుంచి మాయమయ్యాడట. ఇప్పుడు ఎలాగైనా వాళ్ళిద్దరినీ పట్టుకుని తనకి అప్పగించమని, కన్నౌజు రాజ్యాధిపతి మన మహారాజుగారికి లేఖ వ్రాశారు. వారి రాజ్య ప్రతిష్టతో ముడిపడి ఉన్న ఈ రహస్యం బయటకు పొక్కకూడదని మరీమరీ కోరారు. మరో ముఖ్యవిషయం ఏమంటే.. ఆ రాకుమారి కూడా ఇంద్రరాజుని ఇష్టపడిందట.." అని చెప్పడం ఆపాడు చంద్రకేతు.

ప్రతి మాటనీ చెవులు రిక్కించి వింటున్న బ్రహ్మతీర్థ ఆశ్చర్యాన్ని అణుచుకోలేక, "నిజమా..!" అన్నాడు.

"అవును బ్రహ్మతీర్థ గారూ. కానీ... మన పరిస్థితి మీకు తెలిసినదే కదా. రేపు కాక ఎల్లుండు ఉదయమే శిల్పాలయ శంకుస్థాపన. రేపు సాయంత్రానికే ఖజూరవాటికలో ఉండడంకోసం మహారాజు యశోవర్మ గారి వెంట మందీమార్భలాలతో తరలి వెళ్ళబోతున్నాం. ఎక్కడెక్కడి నుంచో అతిథులూ, సేవకులూ, ఆలయ శిల్పులూ, వేడుకని చూడడానికి వచ్చేవాళ్ళూ.. పిల్లాపెద్దా అందరూ ఇప్పటికే ఖజూరవాటికకు చేరుకుని ఉన్నారు. ఇలాంటి సమయంలో.. అంత పెద్ద ఎత్తున జరుగుతున్న సంబరాల్లో ఆ ప్రేమికుల జంటని ఎలా పట్టుకోగలం..? కనీసం ఆ జంట తైలవర్ణ చిత్రాల్ని బయట పెడితేనైనా పట్టుకునే అవకాశం ఉంటుంది. కానీ.. కన్నౌజు రాజు కోరినట్టుగా వాళ్ళ రాజ్య ప్రతిష్టకోసం రాకుమారి ఆనవాళ్ళని మనం బయట పెట్టకూడదు. పారిపోయి వచ్చినది ఎవరో, ఎలా ఉంటారో చెప్పకపోతే, ఖజూరవాటికలోని అంతమంది జనాల్లో ఆ జంటని సైనికులు ఎలా గుర్తిస్తారు..? ఆ జంటని పట్టుకుని కన్నౌజు రాజుకి అప్పగించడం సాధ్యమయ్యే పనే అంటారా.." అని సందేహమూ, అసహాయతా నిండిన గొంతుతో గబగబా అడిగాడు మహామంత్రి చంద్రకేతు.

సునిశితంగా వింటూ, "మీరు చింతించకండి మహామంత్రీ. ఏదో ఒక ఉపాయం ఆలోచిద్దాం.." అని ధైర్యం చెబుతున్నట్టుగా అన్నాడు బ్రహ్మతీర్థ.

"వేడుకల ఉత్సాహంలో ఉన్న మహారాజుగారికి ఈ లేఖ విషయం తెలిస్తే అసహన పడతారనీ.. ఇంకా ఈ లేఖని ఆయనకు చూపలేదు. మహామంత్రిగా నేను, సేనానిగా మీరు.. మన ఇరువురం కలిసి ఏదైనా పరిష్కారం ఆలోచించవచ్చని మిమ్మలను రహస్యంగా రప్పించాను.." అన్నాడు చంద్రకేతు.

"అలాగే మహామంత్రి గారూ. నా ప్రయత్నం నేను శాయశక్తులా చేస్తాను. బాగా ఆలోచించి

ఒక నిర్ణయం తీసుకుందాం..” అని తల ఊపుతూ ఆలోచనలో పడ్డాడు బ్రహ్మతీర్థ.

అక్కడంతా నిశ్శబ్దం ఆవరించుకుంది. కొన్ని క్షణాల తరువాత ఓ ఆలోచన వచ్చినట్టుగా, తలెత్తి చంద్రకేతు ముఖంలోకి చూశాడు బ్రహ్మతీర్థ. “మహామంత్రి గారూ.. ఇంద్రరాజుని పట్టుకునే విషయం ఎలా ఉన్నా, ముందు ఈ విషయాన్ని బయటకు పొక్కకుండా జాగ్రత్త పడితేనే మనం ఆ ఇంద్రరాజుని బంధించగలం. మనం అతన్ని బంధించడానికి ప్రయత్నిస్తున్నామని తెలిస్తే, అతను ఖజూరవాటిక నుండి కూడా తప్పించుకుపోయే అవకాశం ఉంది..” అన్నాడు.

“అవును బ్రహ్మతీర్థ గారూ. కానీ.. ఇంద్రరాజూ, రాకుమారిల తైలవర్ణ చిత్రాల్ని బయట పెట్టకుండా వాళ్ళని ఎలా పట్టుకోగలం..? ఇంకొక విషయం.. ఈ రెండుమూడు రోజులూ మన రక్షణ సేనలు మహారాజు యశోవర్మ గారి వెంటా, కలింజర్ కోటలోనూ ఉంటాయి. మనమేమో శిల్పాలయ శంకుస్థాపనవద్ద మహారాజుగారితోనే ఉంటాము. మరి అదే ఖజూరవాటికలో ఉన్న ఇంద్రరాజునీ కన్నౌజు రాకుమారినీ పట్టుకోవడానికి సుశిక్షితులైన సైనికులూ, వాళ్ళకి తగిన ఆజ్ఞలివ్వడానికి, ఇంద్రరాజూ రాకుమారిల ముఖచిత్రాలు తెలిసిన మంచి నాయకుడూ కావాలిగా..” అని సందేహపడుతూ అన్నాడు మహామంత్రి చంద్రకేతు.

“దానికి ఒక ఉపాయం ఆలోచించాను చంద్రకేతు గారూ. నా కుమారుడు దేవదత్ యుద్ధ విద్యలన్నీ నేర్చుకుని, రెండు రోజుల క్రిందటే ఇంటికి తిరిగి వచ్చాడు. మీకు సమ్మతమైతే.. వారిద్దరి తైలవర్ణ చిత్రాల్ని దేవదత్‌కి చూపి, ఇంద్రరాజూ రాకుమారీలని వెతికి పట్టుకునే పనిని అతనికి అప్పచెబుతాను. అప్పుడు ఆ చిత్రాల్ని ఇక వేరెవరికీ చూపనవసరం లేదు. అంతేకాక.. ఒక గణం సేనల్ని దేవదత్‌కి ఇచ్చి వాళ్ళందరినీ మారువేషంలో ఖజూరవాటికకు పంపి, ఆ గ్రామం మొత్తం జల్లెడ పట్టి కొత్తముఖాలు కనిపిస్తే దేవదత్‌కి ఆచూకీ ఇమ్మని ఆదేశిస్తాను. అప్పుడు ఎవరికీ అనుమానం రాకుండా ఉంటుంది..” అని స్థిరంగా చెప్పాడు బ్రహ్మతీర్థ.

ఆయన చెప్పింది చంద్రకేతుకీ బాగానే ఉందనిపించింది. సరేనన్నట్టుగా తలూపుతూ, “బ్రహ్మతీర్థ గారూ..! అలాగే చేద్దాం. కానీ, శిల్పాలయ శంకుస్థాపన పూర్తి అయ్యేవరకూ మాత్రం మహారాజు యశోవర్మ గారికి ఈ లేఖ విషయాన్ని ఎట్టి పరిస్థితిలోనూ తెలియనివ్వకండి..” అని చెప్పాడు మహామంత్రి చంద్రకేతు.

ఆశ్చర్యంతో నొసలు ముడిచి చూస్తూ, “మహారాజుగారికి చెప్పకుండా ఎలా..” అంటూ అనుమానంగా ఇంకా ఏదో అనబోయాడు బ్రహ్మతీర్థ.

“ఆయనకి ఈ విషయం చెబితే, తన మిత్రరాజ్య రాజుకి ఇలా జరిగిందా అంటూ మహారాజు గారు విచలితులవుతారు. చందేలా వంశ మహారాజు శ్రీ యశోవర్మ గారి చంద్రవంశ ప్రతిష్టతకీ, వారి సౌందర్యారాధనకీ ప్రతీకగా మొదలు కాబోతున్న ఈ శిల్పాలయ శంకుస్థాపనని ఆయన సంపూర్ణ చిత్తంతో నిర్వహించలేరు. అందుకే మనం చెయ్యాల్సినపనిని మనం చేద్దాం. శంకుస్థాపన

పూర్తి అయిన తరువాత.. వీలు చూసుకుని మనం మహారాజుగారికి ఈ వార్తని చెప్పవచ్చు..” అని వివరిస్తున్నట్టుగా చెప్పాడు మహామంత్రి చంద్రకేతు.

చంద్రకేతు చెప్పిన మాటలకి ఆలోచిస్తూ, సరే అన్నట్టుగా తల ఊపాడు బ్రహ్మతీర్థ.

కన్నౌజు మహారాజు పంపిన లేఖనీ; అతని కుమార్తె, ఇంద్రరాజూల తైలవర్ణ చిత్రాల్నీ తెచ్చి బ్రహ్మతీర్థకి ఇచ్చాడు మహామంత్రి చంద్రకేతు.

“ఈ లేఖ మీ వద్దనే ఉంచండి మహామంత్రీ. ఈ రెండు చిత్రాల్నీ నేను తీసుకువెళతాను..” అంటూ ఇంద్రరాజూ, రాకుమారిల చిత్రపటాల్ని తీసుకుని మహామంత్రి ఇంటినుంచి బయలుదేరాడు కలింజర్ రాజ్య సేనాధ్యక్షుడు బ్రహ్మతీర్థ.

తిరిగి వెళ్ళిపోతున్న సేనాధ్యక్షుడిని చూస్తూ, ఇతని పుత్రుడు దేవదత్– ఇంద్రరాజుని బంధించగలడా.. ఏమోలే చూద్దాం.. అని మనసులో అనుకున్నాడు మహామంత్రి చంద్రకేతు.

× × ×

నీళ్ళకుండతో.. తనలోకంలో తానుగా ఇల్లు చేరింది బదనిక.

ఆమె కాలిమువ్వల చప్పుడుకి లోపలనుంచి ముందుగదిలోకి వచ్చింది బదనిక తల్లి సుమిత్ర. ఆవిడ కళ్ళనిండా దాగలేనంత సంబరం కనిపిస్తోంది.

బదనిక కుండని.. చిన్న గుట్టలాంటి ఇసుకపై దించి, దానిమీద మూతపెట్టింది. ఉతికిన బట్టల్ని బయట ఆరేయడానికి వెళ్ళబోతూ, దగ్గరగా వచ్చిన తల్లిముఖంలోని ఆనందాన్ని చూసి, ‘ఏంటి విషయం...?’ అన్నట్టుగా కళ్ళెగరేసింది బదనిక.

“లోకేశ్వరి అత్తయ్య వచ్చింది..” అని, పట్టలేనంత సంతోషంతో తబ్బిబ్బవుతూ చెప్పింది సుమిత్ర.

బదనిక మూతి ముడిచి, “ఉందా, వెళ్ళిపోయిందా..?” అని అనాసక్తిగా అడుగుతూ, బట్టల్ని పట్టుకుని బయటకు నడిచింది.

ఆమె అలా అడగగానే, “ఏమిటే ఆ ప్రశ్న.. పెద్దంతరం, చిన్నంతరం లేకుండా..” అని సున్నితంగా కసురుకుంది బదనిక తల్లి సుమిత్ర.

“అలాగేలే. ఆవిడగారు ఉన్నారా వెళ్ళిపోయారా..?” అని వ్యంగంగా మళ్ళీ అడిగింది బదనిక.

అప్పటివరకూ సంతోషం నిండిన సుమిత్ర గొంతులో మార్పొచ్చింది. “తప్పంతా నాదేలే. ఒక్కదానివనీ.. గారాబం చేసి పెంచినందుకు ఇలాగ తయారయ్యావ్. పట్టూవిడుపూ తెలియకుండా అన్నిటికీ వేళాకోళమే..” అని మందలిస్తున్నట్టుగా అందావిడ.

పరికిణీని తాడుమీద ఆరేస్తూ, “సరేలే.. ఇప్పుడు ఉపోద్ఘాతం మొదలు పెట్టకు. ఆవిడ ఎందుకొచ్చిందో చెప్పు ముందు..” అని విసుగ్గా అంది బదనిక.

వాళ్ళిద్దరి వెనకా నిలబడి వాళ్ళ మాటల్ని చిరునవ్వుతో వింటున్న లోకేశ్వరి, “నేనే చెప్తాలే..

ఎందుకొచ్చానో..” అంటూ వాళ్ళ ముందుకు వచ్చింది.

హఠాత్తుగా అక్కడ తన మేనత్త లోకేశ్వరిని చూసి, ఆవిడ తన మాటలన్నీ విన్నదని అర్థమై నాలుక కరుచుకుంది బదనిక. లోకేశ్వరి నిద్రపోతోంది అనుకున్న సుమిత్ర, ఊహించని విధంగా.. ఆడబడుచు తన ముందుకు వచ్చేసరికి కొంచెం తడబడింది. అయినా తమాయించుకుని, “మీరొచ్చారని చెప్తున్నాను..” అంది సర్దిచెప్తున్నట్టుగా.

“నేను అంతా విన్నానులే వదినా..” అని సుమిత్రతో చెప్పి, మేనకోడలు వంక చూస్తూ, “ఓయ్.. కోడలుపిల్లా..! నాకుగనక కొడుకు ఉంటే.. వాడు నీకు ‘ఈడు’ కాకపోయినా నీకే ఇచ్చి చేద్దునే..” అని మేనకోడలి భుజంపై చరుస్తూ అంది లోకేశ్వరి.

“ఎందుకో..” మూతివిరుపుగా అడిగింది బదనిక.

“ఎందుకేమిటీ.. నీ ముక్కుకి తాడు వెయ్యడానికి..” అంటూ నవ్వింది లోకేశ్వరి.

మేనత్తని ఎర్రగా చూస్తూ, “నా ముక్కుకి తాడు వెయ్యడానికి నేనేమన్నా బర్రెనా, గొర్రెనా..” అని సాగదీస్తూ అంది బదనిక.

“వాటికి కట్టేది పలుపుతాడు, నీకు కట్టేది పసుపుతాడు..” అని మళ్ళీ నవ్విందావిడ.

“రెండిటికీ తేడా ఏముంది. అయినా నీకు కొడుకుంటే మాత్రం నేను వాణ్ని చేసుకుంటానా ఏంటీ..” అని నిర్లక్ష్యంగా అంటూ తన పరికిణీని ఒక్క దులుపు దులిపింది బదనిక.

“చేసుకోవాలి. ఎందుకంటే నువ్వు నాకు అన్నకూతురువి, నా మేనకోడలివి. పేరులోనే వుందిగా నువ్వు నాకు కోడలివని..” దర్జాగా చెప్పింది లోకేశ్వరి.

“పేరులో ఏముంటే అదే ఆ పేరున్నది అయిపోతుందా..? ఐతే నా స్నేహితురాలు సూర్యవతిలో నాకు సూర్యుణ్ని చూపించు..” అని మేనత్తవంక తిరిగి వాదానికి దిగుతున్నట్టుగా అడిగింది బదనిక.

తానూ ఎదురువాదానికి సిద్ధపడినట్టుగా, “నా పుట్టింటిలోనిదంతా ఇంటి ఆడబడుచుగా నాదేకదా. మరి అలా చూసుకున్నా, నువ్వు నాకు చెందిన దానివేగా.. అంటే నాదానివేగా..” అంది లోకేశ్వరి.

“ఈ ఇంటి ఆడబడుచుగా అన్నీ మీవే. కానీ, నేను కాదు..” అని కొంచెం విసురుగా తడి పరికిణీని తాడుమీద ఆరేసింది బదనిక.

“అదేంటి..! అన్నీ నావే.. అని నువ్వే అంటున్నావు కదా. మరి నువ్వు మాత్రం ఎందుకు కాకుండా పోతావ్..?” అని వెంటనే అడిగింది లోకేశ్వరి. ఆమెలో మేనకోడల్ని ఓడించాలనే సరదా తొంగిచూసింది.

బట్టలు ఆరేస్తున్నదల్లా ఆగి మేనత్త వైపు స్థిరంగా చూస్తూ, “మీ అమ్మకు అంటే.. మా నానమ్మకు చెందినవి.. ఆవిడ కూతురిగా మీకే చెందుతాయి. అంటే మీ పుట్టింట్లోవి అన్నీ మీవే. కానీ, నేను మీ అమ్మ సంపాదించిన ఆస్తిని కాను..” అని తెగేసి చెప్పింది బదనిక.

ఆమె వాదన విని, గుండె దడదడ కొట్టుకుంటుంటే.. కూతురు చెయ్యిపట్టుకుని వెనక్కు లాగింది సుమిత్ర.

"మీ అమ్మే ఈ ఇంటికి కోడలై మా ఇంటి ఆస్తి అయ్యింది. మీ అమ్మదంతా మాదే అవుతుంది కదా. అలా అయినా నువ్వు నాకు చెందాల్సిన దానివే కదా..." అంటూ మెలికపెడుతూ అడిగింది లోకేశ్వరి. ఆమెకి మేనకోడలితో ఈ సంవాదం ఉత్సాహంగా ఉంది.

"మా అమ్మ ఇక్కడకు రాకముందు ఉన్నది మాత్రమే మీ ఆస్తి. మా అమ్మ ఇక్కడకు వచ్చాక సంపాదించినది ఏదైనా అది– ఈ ఇంట్లో ఆవిడకూ, అందులో దోహదపడిన వారికీ మాత్రమే చెందుతుంది. అంటే.. నేను మా అమ్మకీ, నాన్నకీ మాత్రమే స్వంతం. ఎటునుంచి చూసుకున్నా మీకు అస్సలు స్వంతమన్నది రాదు. ఎందుకంటే.. మీరు అప్పటికే ఈ ఇంట్లోనుంచి వేరే ఇంటికి కోడలిగా వెళ్ళి, మరొకరి ఆస్తి అయ్యారు.." అంటూ లోకేశ్వరికి ధీటుగా సమాధానం చెబుతూ గర్వంగా చూసింది బదనిక.

మేనకోడలి వాగ్ధాటికి సంభ్రమం చెందుతూ, "నీతో నేను మాట్లాడలేనని ఒప్పుకుంటున్నానే బదనీ.." అని మనస్ఫూర్తిగా అంది లోకేశ్వరి.

పందెపు కోడిపుంజుల్లా మాటలకత్తులు రువ్వుకుంటున్న వాళ్ళిద్దరి సంభాషణ మధ్యలోకి వెళ్ళే ధైర్యం చెయ్యలేక, అసహాయంగా నిలబడ్డ సుమిత్ర– ఈ విరామక్షణం కోసమే చూస్తోంది. అందుకే ఈ సమయాన్ని వెంటనే ఉపయోగించుకుంటూ, "బదనీ.. నువ్వు లోపలకు వెళ్ళి పని చూడు.." అంది హెచ్చరింపుగా.

బట్టలు ఆరేయడం అయిపోవడంతో లోపలకి వెళ్తూ, "లోపల ఏం పని ఉందనీ..? వంటపని అయిపోయిందిగా. తి..న..డ..మేగా మిగిలింది. మీ ఆడబడుచు గారు వస్తున్నట్టు ముందు కబురైనా పంపలేదు. కబురంపితే కోడినో, కొబ్బరికాయనో; పీతనో, పచ్చిచేపనో,.. ముదమారా మనం ఈ వేళ వరకూ పాకశాలలో పడి వండుతూ మన ప్రావీణ్యం చూపుతూందుముగదా.." అని మేనత్తవంక చూసి, వెక్కిరింతగా అంటూ లోపలకు వెళ్ళిపోయింది బదనిక.

ఆడబడుచు ఏమనుకుంటుందో ఏమో, తరువాత భర్తతో ఏం చెప్తుందో.. అని భయపడుతూ, "దాని మాటల్నేం పట్టించుకోకండి వదినా. ఈ మధ్య బొత్తిగా భయం లేకుండా పోతుంది పిల్లకి.." అని కొంచెం నిదానంగా అంది సుమిత్ర.

లేడిపిల్లలా చెంగున గడప దూకి లోపలకి వెళ్ళిపోతున్న బదనికని ముచ్చటగా చూస్తూ, "దాని మాటల్దేముందిలే వదినా. చిన్నపిల్ల.." అని సుమిత్రవైపు తిరిగి, "మన బదనికని చూస్తుంటే.. నాకు మా అమ్మే కనిపిస్తుంది వదినా. ఆ మాటతీరూ, ఆ విరుపూ చూడూ.. అచ్చం అమ్మ మాట్లాడినట్టు లేదూ.." అని మురిసిపోతూ అంది లోకేశ్వరి.

"ఆ.. అవునవును. అచ్చం మీ అమ్మలానే ఉంటుంది.." అని కంగారుపడుతూ, "లోపలకు

వెళదాం రా వదినా..” అంటూ లోకేశ్వరి చేయిపట్టుకుని ఇంట్లోకి నడిచింది సుమిత్ర.

లోపలంతా గాడాంధకారం...! గూట్లో ఉన్న దీపంవత్తు లోపలకు తోసేసి ఉంది. ఇప్పుడో, మరుక్షణంలోనో అది కొండెక్కడానికి సిద్ధమై కనిపించింది సుమిత్రకి. ఈ ఘనకార్యం బదనికదేనని అర్థమై, గబగబా వెళ్ళి దీపపువత్తుని పైకి పెంచిందావిడ. అప్పటివరకూ చీకటిగా ఉండడంతో వాళ్ళకి మంచంపై ఉన్న బదనిక కనబడలేదు. దీపపు వెలుతురు పెరగగానే కనిపించిన బదనికని చూస్తూ, “బదనీ.. బదనికా..” అని మేనకోడల్ని పిలుస్తూ మంచందగ్గరకు నడిచింది లోకేశ్వరి.

బోర్లా పడుకున్న బదనిక– మేనత్త తన దగ్గరకు వస్తుండడం చూసి, మూతి ముడుచుకుని తలని అటువైపుకు తిప్పి పడుకుంది. బదనిక పక్కనే మంచంమీద కూర్చుంటూ, “మా బదనీ అలిగిందా..!” అంది. “నీకో మంచి విషయం చెప్పాలని నేనెంత సంతోషంగా వచ్చానో తెలుసా. చెప్పమంటావా.. వద్దా..?” అంటూ మేనకోడలి బుగ్గ పట్టుకుని లాగింది.

“మీకు పోట్లాడడానికి అక్కరకొచ్చే సమయం.. మంచి విషయాలు చెప్పడానికి ఉండదే...?” అంటూ మేనత్తవంక ఉక్రోషంగా చూసింది బదనిక.

“కోడలుపిల్లా..! ఎంత రాలుగాయివే. మా అమ్మ బతికుంటే.. ఈ సరికే నీకు వడ్డాణం చేయించుండేది..” అని మురిపెంగా బదనికని చూసి, నవ్వుతూ అంది లోకేశ్వరి.

సుమిత్రకి నోటమాటరాలేదు. ‘ఇదేమో పెంకితనంతో పెద్దాచిన్నా లేకుండా మాట్లాడు తోంది. ఇలా పొగరుగా మాట్లాడుతున్నావేంటీ అని దానిమీద విరుచుకుపడాల్సిందిపోయి, అత్తయ్యగారు బతికుంటే వడ్డాణం చేయించుండేవారు అంటుందేంటీ..!’ అనుకుంది సుమిత్ర.

“నాకు వడ్డాణాలూ, కందెలీలూ, కిరీటాలేం అవసర్లేదు. మీలాంటివాళ్ళ ఇంటికి కోడల్ని అవకుండా ఉంటే చాలు..” అని కొట్టినట్టే చెప్పింది బదనిక.

“చూశావా వదినా..! ఇది మా అమ్మే. ఆ సమాధానం చూశావా.. ఎంత ఠంగుమని చెప్తుందో..” అంటూ సంబరంతో సుమిత్రవంక చూసింది లోకేశ్వరి.

“అవును.. అచ్చం అత్తగారి పోలికలే...” అని వచ్చీరాని నవ్వు నవ్వుతూ, వంటగదివైపు వెళ్ళింది సుమిత్ర.

లోకేశ్వరి ఆనందంతో బదనిక కణతలపై మెటికలు విరుస్తూ, “అందుకే.. మా బంగారుతల్లిని పువ్వుల్లో పెట్టి చూసుకునే మొగుడ్ని తీసుకొచ్చా..” అంటూ మేనకోడల్ని చేయిపట్టి లేపింది.

లోకేశ్వరి మాటలకి నివ్వెరపోతూనే, లేచి మంచంమీద కూర్చుంటూ, “మొగుడా..!” అని ఆశ్చర్యంగా కళ్ళు పెద్దవి చేసి మేనత్తవంక చూసింది. ముద్దుగా ఉన్న బదనిక బుగ్గని లాగుతూ, “ఆ.. మొగుడే..! నీ ముక్కుకి తాడు వేసే మొగుడు..” అని చెప్పింది లోకేశ్వరి.

బదనిక నొసలు ముడిచి మేనత్తవంక అనుమానంగా చూస్తూ, “నువ్వు నాకు మొగుణ్ని చూశావా..! మీ అన్నగారిలా ఇల్లుని వదిలేసి రాళ్ళూరప్పల్లో బతికేవాడు కాదుకదా..” అని

పరిహాసంగా అడిగింది. దానికి ఆమెబుగ్గపై పొడుస్తూ, "ఊరుకోవే మేనకోడలా. నీకు నేనూ, మా అన్నా ఎప్పుడూ అలుసే. ఏం.. మీకేం తక్కువ చేశాడేంటీ మా అన్న. రేపు శంకుస్థాపనలో చూడు మా అన్న చేసేపని ఎంత విలువైనదో, ఎన్ని కాలాలు నిలిచేదో తెలుస్తుంది.." అంటూ ఎంతో గొప్పగా చెప్పింది లోకేశ్వరి.

"తక్కువేమీ చెయ్యలేదమ్మా మీ అన్నగారు. అన్నీ ఎక్కువే చేశారు. అన్నీ ఎక్కువే, ఎదురుచూపులు కూడా ఎక్కువే. మాసంలో ఆయనగారు వచ్చే రెండుమూడు రోజులకోసం పాతిక రోజుల ఎదురుచూపుల్ని ఇచ్చారు. మొన్నటివరకూ ఎక్కడో పని చేసి వచ్చారా.. ఇప్పుడు ఈ పని..! మహారాజు గారు కట్టబోయే శిల్పాలయంకోసం జలపాతం అవతలెక్కడో రాళ్ళు చెక్కుతున్నారంట. ఆశ్రమం వేసుకుని అక్కడే ఉంటున్నాడు మీ అన్న. ఎప్పుడో వచ్చే ఆ ఒకటీ రెండు రోజులు కూడా ఇంటికి రావడం లేదిప్పుడు.." అంటూ అప్పుడే అక్కడకు వచ్చిన తల్లిని ఓరగా చూస్తూ, పెద్ద ఆరిందాతనంతో దీర్ఘంతీస్తూ చెప్పింది బదనిక.

లోకేశ్వరికి మనసుమూలల్లో ఎక్కడో కలుక్కుమంది. నిజమేగా.. పక్షానికి ఓనాడు ఇంటికి వస్తాడు అన్న. మగవాడు లేని ఈ ఇంట్లో ఇద్దరు ఆడవాళ్ళే బిక్కుబిక్కుమంటూ ఉంటున్నారు.. అనుకోగానే లోకేశ్వరికి తన వదిన సుమిత్రపై జాలేసింది. బరువుగా నిట్టూరుస్తూ, "నిన్ను వరించబోయేవాడు మా అన్నలాంటి వాడు కాదులేవే బదనీ..! ఎప్పుడూ నీతోనే ఉంటాడు. రాత్రుళ్ళే కాదు.. నువ్వు రతీదేవిలా సరసంతో అలరించుకోవాలే గానీ, పగలుకూడా నీ వెంటే ఉంటాడు.." కవ్విస్తున్నట్టుగా అంది లోకేశ్వరి.

"ఏంటీ.. ఆటపట్టిస్తున్నావా.." అనుమానంగా అడిగింది బదనిక.

"నేను పట్టించే ఆటదేముందిలే. మా అబ్బాయి వస్తున్నాడుగా.. వాడు పట్టిస్తాడు నిన్ను ఒక ఆట.." అని నవ్వుతూ బదులిచ్చింది లోకేశ్వరి. అప్పుడే లోపలకు రాబోయిన సుమిత్ర– కొన్ని నిముషాలక్రితం పందెంపుంజుల్లా వాదించుకున్న వాళ్ళిద్దరూ.. వీళ్ళిద్దరేనా.. అన్నట్టు వారిద్దర్నీ విచిత్రంగా చూస్తూ, అక్కడే తలుపుకి చేరబడి నుంచుంది.

"నన్ను మాటల్తో మాయ చేయకు. ముందు ఆ కాబోయేవాడు ఏం చేస్తాడో చెప్పు..." అని అడిగింది బదనిక.

"నిన్ను చేసుకోబోయేవాడు రాళ్ళపనీ చెయ్యడు, కూలిపనీ చెయ్యడు. నీతోనే ఉంటాడు, నీకోసం ఏమైనా చేస్తాడు.." అంటూ బదనికని ఊరిస్తున్నట్టుగా చెప్పింది లోకేశ్వరి.

"ఏం చెయ్యడో కాదు, ఏం చేస్తాడో చెప్పమన్నానా.." మూతి బిగబట్టి, చూపుడువేలుని చూపిస్తూ అడిగింది బదనిక.

"చెబుతాలే కోపం తెచ్చుకోకు. ఏదీ చెయ్యాల్సిన అవసరం లేనివాడు. తిని కూర్చున్నా తరగని ఆస్తిపాస్తులున్నవాడు.." అంటున్న లోకేశ్వరి ఇంకా చెప్పడం పూర్తి కాలేదు.

"అంటే.. ఏమీ చెయ్యకుండా ఖాళీగా నా వెనక తిరుగుతూ ఉంటాడా..! అలాంటి బద్ధకస్తుడు నాకు వద్దు.." అని అలకగా అంది బదనిక.

"ఎందుకు చెయ్యడు. నువ్వేం చెప్పినా గురి తప్పకుండా చేస్తాడు..."

"ఆగాగు.. గురితప్పకుండా అంటే వేటగాడా..! ఊహు.. అటువంటి మొరటువాడూ నాకొద్దు.." అని దురుసుగా అనేసి పక్కకు తిరిగిపోయింది బదనిక.

తలుపుకి చేరబడి మేనత్తాకోడళ్ళ సంభాషణంతా వింటున్న సుమిత్ర బిత్తరపోతూ కూతురి వంక చూసింది. 'ఇప్పటికే వయసొచ్చిన కూతుర్ని ఇంట్లో పెట్టుకున్నారంటూ అందరూ అదోలా చూస్తున్నారు. ఇదిలా మంకుపట్టు పడితే ఎలారా భగవంతుడా..' అని మనసులో అనుకుందావిడ.

"హబ్బ.. అన్నిటికీ తొందరే నీకు. ఇలా అయితే నేను చెప్పనంతే. మంచి సంబంధం, నీకు సరైన జోడు. అన్నయ్య కూడా సరే అన్నాడు. నీకూ నచ్చుతాడని అనిపించి వాళ్ళకి మాట ఇచ్చేశాను.." అని గడగడా చెప్పింది లోకేశ్వరి.

"మాట ఇచ్చేశావా...!!" అని అడిగింది బదనిక.

"అవునే.. నీకు ఈడైనవాడు, జోడైనవాడు అనిపించింది. అయినా మీ మామయ్యగారి చలువవల్ల వాళ్ళు మనలో ఎవరైనా మంచి అమ్మాయి ఉంటే చూడమన్నారు. మా మేనకోడలు ఉంది అనగానే ఖాయం చేసుకుందాం అన్నారు.." అని గట్టిగా చెప్పింది లోకేశ్వరి.

"ఒకవేళ నాకు నచ్చకపోతే.." అని మేనత్తవైపు చూసి, అడిగింది బదనిక.

ఆమె ప్రశ్నకి విస్తుపోయినట్టు బదనికవంకా, ఆమె తల్లి సుమిత్రవంకా చూసింది లోకేశ్వరి. బదనిక పెడసరితనాన్నీ, లోకేశ్వరి సమర్థింపునీ చూడలేక, భోజనాలు పెట్టడానికి అనే వంకతో గబగబ వంటగదిలోకి వెళ్ళిపోయింది సుమిత్ర.

బొమ్మలా బిగుసుకుపోయిన మేనత్తను కుదుపుతూ, "అతను ఏం చేస్తాడూ అంటే ఎలాగూ చెప్పలేదు. కనీసం ఎలా ఉంటాడో అదైనా చెప్పు.." అని ఆత్రుతగా అడిగింది బదనిక. హమ్మ రాలుగాయీ ఇప్పుడు దొరికావులే.. అని మనసులో అనుకుంటూ పైకిమాత్రం, "నీతో వాగీవాగీ నాకు నీరసమొచ్చింది. ఆ విషయం రేపు చెబుతాలే.." అందావిడ బదనికని ఆట పట్టిస్తూ.

"మానెయ్. నాకేం చెప్పనవసరం లేదు. నాకు పెళ్ళి చేసుకోవడం ఇష్టంలేదని వాళ్ళకి చెప్పెయ్. నన్ను చూడడానికి వాళ్ళు వచ్చినా నేను కనిపించను వాళ్ళకి. పాండవుల జలపాతానికో, లేకపోతే పక్కనే ఉన్న అడవిలోకో పోతాను.." అని బుంగమూతి పెట్టి అంటూ, గబగబా మంచం మీదనుంచి దిగబోయింది బదనిక.

లేస్తున్న బదనికని, "ఆగాగు.." అంటూ చేయిపట్టుకుని ఆపింది లోకేశ్వరి.

"మరి చెప్పు.. ఎలా వుంటాడు..?" అని లోకేశ్వరి పక్కన కూర్చుంటూ, మళ్ళీ అడిగింది బదనిక. ఆమెలో అతని గురించి తెలుసుకోవాలన్న కుతూహలం.

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/book/Khajoora+Vatika**

* * *